ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 26 డిసెంబరు 2024


పూర్ణాహుతిలో పాల్గొన్న ఆలయ ఈవో రామారావు

సిందూర శోభితం

ముగిసిన భవానీ దీక్షా విరమణ మహోత్సవాలు

ఘనంగా పూర్ణాహుతి.. ఇంకా తరలివస్తున్న భవానీలు 6లో

ఐదు రోజుల్లో 3.5 లక్షల మంది దర్శించుకున్నారని అంచనా


కనకదుర్గానగర్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) అమ్మవారి ఉత్సవమూర్తి


విజయవాడలోని గుణదల మేరీమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ వేడుకలు జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపి, క్రీస్తు భక్తి గీతాలను ఆలపించారు. మత పెద్దలు క్రీస్తు సందేశం ఇచ్చారు. 'మానవాళిని రక్షించేందుకు కరుణామయుడు జన్మించారు. ఆయనలోని ప్రేమ, త్యాగం, దయ గుణాలు అందరికీ ఆదర్శం. ఆయన చూపిన మార్గం అనుసరణీయం' అని వివరించారు. ఆయా చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు అ ధిక సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు.


మచిలీపట్నంలోని హైనీ చర్చిలో కేకు కట్ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

అర్ధరాత్రి అమ్మను అనాథలా

వదిలేశారు



ఆమె ఐదుగురు బిడ్డలకు జన్మనిచ్చింది. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసింది. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన ఆ బిడ్డలు తల్లి పేగుబంధం కంటే డబ్బే ముఖ్యం అనుకున్నారు. ఆమె వద్ద ఉన్న డబ్బు తీసుకుని మంగళవారం అర్ధరాత్రి కృష్ణాజిల్లా కరకట్ట వెంబడి కె.కొత్తపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్లిపోయారు. గమనించిన స్థానికులు ఆమె వద్దకెళ్లి ఆరా తీయగా తన పేరు పగడాలమ్మ అని, తనది శ్రీకాకుళం జిల్లా అని చలిలో వణుకుతూ చెప్పింది. తన ఐదుగురు బిడ్డలు తన వద్ద ఉన్న డబ్బు తీసుకుని తనను ఇలా వదిలేసి వెళ్లారని కన్నీరు పెట్టుకుంది. ఈ విషయంపై గ్రామస్తులు అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

-మోపిదేవి,(ఆంధ్రజ్యోతి)

విద్యాధరపురం డిపోలో

చార్జింగ్ స్టేషన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎలక్ట్రికల్ బస్సుల కోసం విద్యాధరపురం బస్ డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. నగరానికి అతి త్వరలో 100 ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్న నేపథ్యంలో ఈలోపే చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. విజయవాడ నగర పరిధిలో నడిపే ఎలక్ట్రికల్ బస్సులన్నింటినీ విద్యాధరపురం బస్ డిపోకు కేటాయించారు. విద్యాధరపురం డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందుకు హెచ్‌టీ పవర్ సప్లై కావాల్సి ఉంది. ఈ మేరకు విద్యుత్ శాఖకు చార్జీలను చెల్లించనున్నారు.

28న కృష్ణాజిల్లాలో ఏకసభ్య కమిషన్ బృందం పర్యటన 6లో

బ్రహ్మయ్య లింగేశ్వర క్షేత్రానికి

మహర్దశ!

- 50 గదులతో 'హరిత బ్రహ్మకైలాస్ రిసార్ట్'!
- 'బ్రహ్మకైలాసం క్షేత్రం' దిగువన ఏర్పాటు
- బ్రహ్మయ్యలింగం చెరువులో వాటర్ స్పోర్ట్స్
- ఏపీటీడీసీ బోర్డు మీటింగ్‌లో కీలక నిర్ణయాలు
- సీఎం చంద్రబాబు, లోకేష్‌తో భేటీ తర్వాత మరిన్ని ప్రతిపాదనలు
- కేంద్రం నుంచి నిధులు పొందే అవకాశాలపై అధ్యయనం

ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి క్షేత్రం. ఎత్తైన కొండపై కొలువు తీరిన స్వామివారు.. దిగువన విశాలమైన బ్రహ్మయ్య లింగం చెరువు.. చుట్టూ కొండలు, పచ్చని మామిడి తోటలతో అలరారుతోంది. ఈ క్షేత్రం అభివృద్ధిపై పర్యాటక అభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. కాటేజీల ఏర్పాటు, బోటింగ్ కార్యకలాపాలతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇక బ్రహ్మయ్య లింగేశ్వర క్షేత్రానికి మహర్దశ రానుంది.


బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి క్షేత్రం (ఇన్‌సెట్‌లో)బ్రహ్మయ్యలింగం చెరువు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరం- నూజివీడు నియోజకవర్గాల సరిహద్దులో ఆగిరిపల్లి మండలం తోటపల్లి, గన్నవరం మండలం చిక్కవరం గ్రామాల మధ్య కొలువై ఉన్న బ్రహ్మయ్య లింగేశ్వరసామి (బ్రహ్మకైలాసం) క్షేత్రానికి మహర్దశ రానుంది. ఎన్నాళ్ల నుంచో వేచి చూస్తున్న పర్యాటకాభివృద్ధికి అడుగులు పడ్డాయి. రాజధాని ప్రాంత పరిధిలో బ్రహ్మయ్య లింగం చెరువును అత్యద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న అంశంపై పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) బోర్డు మీటింగ్‌లో చర్చ జరిగింది. పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి కాటేజీల ఏర్పాటు, బోటింగ్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీటీడీసీ అధికారులకు ఆ సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ దిశానిర్దేశం చేశారు.


ఇటీవల ఆలయాన్ని సందర్శించిన చైర్మన్ నూకసాని

ఏపీటీడీసీ చైర్మన్ హోదాలో నూకసాని బాలాజీ ఇటీవలే బ్రహ్మయ్యలింగం చెరువును, బ్రహ్మయ్య లింగేశ్వర దేవస్థానాన్ని సందర్శించారు. ఈ క్రమంలో బ్రహ్మకైలాసం క్షేత్రంలో 2వ శతాబ్దం నాటి బ్రహ్మయ్య లింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించారు. క్షేత్రం చుట్టూ కొండసానువులు, ప్రకృతి రమణీయత, నిండుకుండలా బ్రహ్మలింగం చెరువును చూసి ఇంత అద్భుతమైన ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందకపోవటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విజయవాడ డివిజన్ ఉన్నతాధికారులకు దీనిపై సమగ్ర ప్రణాళికలు తయారు చేయాల్సిందిగా అప్పటికప్పుడు నిర్దేశించారు.

అమరావతి పరిధిలో అత్యద్భుత ప్రాంతం

తాజాగా జరిగిన బోర్డు మీటింగ్‌లో ఈ మేరకు బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయటానికి ఉన్న అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో అత్యద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయటానికి అవకాశాలున్న ప్రాంతం కావటంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పరంగా మరింత సహకారం పొందాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బ్రహ్మయ్యలింగం చెరువును కేంద్ర ప్రభుత్వ నిధులతో కూడా అభివృద్ధి చెయ్యటానికి ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాల్సిందిగా చైర్మన్ నూకసాని అధికారులకు సూచించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డీపీఆర్‌లు తయారు చేయించాలని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆమోదముద్ర తీసుకుని కేంద్రానికి పంపించటం ద్వారా మరిన్ని నిధులు సాధించాలన్న ఆలోచన చేశారు.

ఏపీటీడీసీ ప్రతిపాదనలు ఇలా..



విజయవాడ డివిజన్ ఏపీటీడీసీ ఉన్నతాధికారులు దాదాపుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్రహ్మకైలాస్ క్షేత్రంపై శాశ్వతంగా ప్రభుత్వ నిర్వహణలోనే కొనసాగేలా 50 గదులతో కూడిన కాటేజీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. బ్రహ్మకైలాసం దిగువన బ్రహ్మయ్యలింగం చెరువుకు కాస్త ఎగువన నీటి వనరులకు అత్యంత సమీపంలో ఈ రిసార్ట్‌ను ప్రతిపాదించారు. అలాగే బ్రహ్మయ్యలింగం చెరువులో వాటర్ స్పోర్ట్స్ కార్యకలాపాలు కూడా ప్రారంభించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి అతి త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గర చర్చించి అంతిమ నిర్ణయం తీసుకోనున్నారు.

పనలపైనే పంట

- మూడు రోజులుగా పడుతున్న చిరు జల్లులు
- గింజలు నీటిలో నాని మొలకొస్తుందని రైతుల్లో భయం
- రెండో పంటగా వేసిన మినుముపై వాతావరణ ప్రభావం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేశారు. ఇప్పటి వరకు సుమారుగా లక్ష హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. గతంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కొందరు రైతులు యంత్రాల ద్వారా వరికోతలు పూర్తిచేశారు. తేమశాతం అధికంగా ఉన్నప్పటికీ ఆరబెట్టేందుకు అవకాశం లేక ధాన్యం తక్కువ ధరకే విక్రయించేశారు. ప్రస్తుతం జిల్లాలో 24 వేల హెక్టార్లకుపైగా పంట కోత కోసి పనలపై ఉంది. 90 వేల టన్నులకు పైగా ధాన్యం పనలు, కుప్పల్లో ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లుల కారణంగా కోతకోసి ఉన్న పంటను కుప్పలుగా వేసేందుకు అవకాశం లేక రైతులు అలానే వదిలేశారు. గురువారం కూడా వర్షం కురుస్తుందనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు వరికోతలను తాత్కాలికంగా వాయిదా వేశారు. మోపిదేవి మండలం వెంకటాపురం, పెదకళ్లేపల్లి, పెదప్రోలు, కొక్కిలిగడ్డ, మోపిదేవి, మచిలీపట్నం మండలం గుండుపాలెం, సీతారామపురం, గూడూరు మండలం మల్లవోలు, తరకటూరు, పోలవరం, పామర్రు మండలం ఉండ్రపూడి, మొవ్వ మండలం కారకంపాడు, కూచిపూడి, మొవ్వ తదితర ప్రాంతాల్లో అధికశాతం పొలాల్లో వరి కోత కోసి పనలపై ఉంది. గత మూడు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకు తడుస్తూనే ఉంది. దీంతో ధాన్యం మొలకెత్తుతుందనే భయం రైతులను వెంటాడుతోంది.


మోపిదేవి మండలంలో వెంకటాపురంలో పనలపై పంట

మినుము పైరుకు చేటు

వరి కోత కోసేముందు రెండో పంటగా మినుము విత్తనాలు జల్లారు. ప్రస్తుతం పైరు రెండాకులు, బిళ్లాకుదశలో ఉంది. మొజాయిక్ తెగులు సోకకుండా మందులను పిచికారీ చేశారు. వరుసగా పడుతున్న చిరుజల్లులతో మినుముపైరుకు తేమశాతం పెరిగి మొక్కలు చనిపోయే ప్రమాదం ఏర్పడింది.

ధాన్యం కొనుగోలులో మాయాజాలం

ధాన్యం కొనుగోలులో దళారులు, మిల్లర్లు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది సిండికేట్‌గా మారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను శాసిస్తున్నారు. మూడు రోజుల కిందట గూడూరు మండలంలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. గూడూరు సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన రైతు ఐదు ఎకరాలలో పంటను యంత్రాల ద్వారా కోసి రెండు రోజుల పాటు ఆరబెట్టాడు. మిల్లులతో సంబంధంలేని చోట ధాన్యంలో తేమశాతం చూపిస్తే 22 పాయింట్లుగా చూపింది. దీంతో ధాన్యం రైతు సేవా కేంద్రానికి తీసుకెళితే అక్కడ తేమశాతం 25 పాయింట్లుగా చూపారు. వాతావరణం బాగోలేదని తన ధాన్యం విక్రయిస్తానని సదరు రైతు చెబితే ఇక్కడి వరకు ఎందుకువచ్చారు, మిల్లుకు వెళ్లి ధాన్యం చూపితే మిల్లర్లు, దళారులు మద్దతు ధరను నిర్ణయిస్తారని, వారి సూచనల మేరకు మేము ధాన్యం విక్రయించినట్లుగా ఆన్‌లైన్ చేస్తామని ఉచిత సలహా ఇచ్చారు. సదరు రైతు మిల్లు వద్దకు వెళితే బస్తా ధాన్యం రూ.1,450 మించి ఇవ్వలేమని చెప్పారు. దీంతో సదరు రైతు తనకు తెలిసిన అధికారి ద్వారా మిల్లు యజమాని, ఆర్‌ఎస్‌కే సిబ్బందితో పలుమార్లు మాట్లాడించడంతో ఎట్టకేలకు బస్తా రూ.1,650 చొప్పున మద్దతు ధరగా నిర్ణయించి ధాన్యం వివరాలను ఆన్‌లైన్ చేశారు.

సీఎం హెచ్చరించినా మారని తీరు..

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కంకిపాడు, పెనమలూరు మండలాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో రైతుల ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని, అక్రమాలకు పాల్పడివారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అయినా ధాన్యం కొనుగోలులో వ్యాపారులు, మిల్లర్లు మోసం చేస్తూనే ఉన్నారు.

సాగునీటి కష్టం

- ఏనుగులకోడు డ్రెయిన్‌పై విరిగిన సాగునీటి తూములు
- డ్రెయిన్‌లో వృథాగా పోతున్న సాగునీరు
- వందల ఎకరాల సమస్యను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- నీటి వినియోగదారుల సంఘాల రాకతో రైతుల్లో ఆశ

తోట్లవల్లూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండలంలో బందరు కాలువ నుంచి వ్యవసాయానికి అందే సాగునీటి రంగాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి నిర్వీర్యం చేసింది. వందల ఎకరాలకు బందరు కాలువ నుంచి ఏనుగుల కోడు డ్రెయిన్‌పైగా తూముల ద్వారా అందే సాగునీరంతా వృథాగా ఏనుగులకోడు డ్రెయిన్‌లో కలిసిపోతున్నా పట్టించుకోలేదు. దీంతో ఈ కాలువ కింద ఉన్న రైతులు బోర్లు, వర్షాలపై ఆధారపడి వరిసాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే... తోట్లవల్లూరు మండలంలో బందరు కాలువ ఉంది. దాని పక్కనే ఏనుగులకోడు డ్రెయిన్ ఉంటుంది. ఆ తర్వాత పంట పొలాలు ఉన్నాయి. ఈ పంట పొలాలకు బందరు కాలువ నుంచి సాగునీటిని అందించేందుకు రెండు దశాబ్దాల కిందట ఇరిగేషన్ అధికారులు తూములను నిర్మించారు. బందరు కాలు కట్టను తవ్వి ఏనుగులకోడు డ్రెయిన్ మీదుగా పెద్దపెద్ద సిమెంటు తూములను ఏర్పాటు చేశారు. ఈ తూముల నుంచి ఏనుగులకోడు డ్రెయిన్ మీదుగా పంట పొలాల పక్కనే ఉన్న పిల్ల కాలువలకు సాగునీటిని అందించేవారు. దీంతో ఈ ప్రాంత రైతులు బందరు కాలువ నీటితో వరి, చెరకు పంటలు పండించేవారు.


తోట్లవల్లూరు చిల్లడొంక వద్ద ఏనుగులకోడు డ్రెయిన్‌పై ధ్వంసమైన సాగునీటి తూములు

విరిగిన తూములు

తోట్లవల్లూరు, కుమ్మమూరు దగ్గర రెండు చోట్లా ఈ సాగునీటి తూములు విరిగిపోయాయి. తూములు పాడై పోవడంతో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో బందరు కాలువ నుంచి వచ్చే సాగునీరంతా ఏనుగులకోడు డ్రెయిన్‌లో కలిసిపోతోంది. దీని గురించి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపినా రూపాయి కూడా విడుదల చేయలేదు. దాంతో రైతులు వర్షాలపైనా, మోటార్లపైనా ఆధారపడి పంటలు సాగుచేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

సాగునీటి సంఘాలపైనే ఆశలు

ప్రస్తుతం సాగునీటి వినియోగదారుల సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించటంతో పాలక వర్గాలు వచ్చాయి. రైతుల నుంచే పాలక మిగతా 6లో..

ముగిసిన భవానీ దీక్ష విరమణలు



భవానీ దీక్షల విరమణ ముగింపు కార్యక్రమం పూర్ణాహుతిలో ఈవో రామారావు దంపతులు



- దుర్గమ్మను దర్శించుకున్న 3.70 లక్షల మంది భక్తులు
- వేద మంత్రాల మధ్య ఘనంగా పూర్ణాహుతి



వన్‌టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి ప్రారంభమైన ఐదు రోజుల భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా యాగశాలలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు దంపతులు పాల్గొన్నారు. హోమగుండంలో పూర్ణాహుతి సమిధలను సమర్పించి అమ్మవారి



ఆశీస్సులు పొందారు. సకలజనుల శ్రేయస్సు కోరుతూ నిర్వహించిన పవిత్ర కార్యక్రమాలకు ముగింపుగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు, అమ్మవారిని శరణు కోరి శాంతి, పుష్టి, ధైర్యం, విజయం అందరికీ కలిగించాలని సంకల్పం చెప్పారు. ఈనెల 21 నుంచి ఆలయంలో చండీహోమాన్ని నిర్వహించారు. దీంతోపాటుగా అమ్మవారిని సంతుష్టిపరిచేందుకు వివిధ పారాయణలు, పూజలు దేవస్థానం నిర్వహించింది. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు, ముఖ్యఅర్చకులు పాల్గొన్నారు.

అత్యంత వైభవోపేతంగా కార్యక్రమాలు..

పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఈవో మాట్లాడుతూ, ఐదు రోజుల భవానీ దీక్షల విరమణల కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయన్నారు. బుధవారం సాయంత్రం వరకు 3.5లక్షల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నారని, ఇంకా భక్తులు వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో కార్యక్రమాలు విజయంతమయ్యాయన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి తదితరులు ఎంతో సహకారం ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు సాంకేతికతను వినియోగించుకుని, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సహకారంతో ఎక్కడా పొరపాట్లు జరగకుండా భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవానీ భక్తులు మౌలిక సదుపాయాలను సులభంగా పొందేందుకు దాత సహకారంతో యాప్ విజయవంతమైందన్నారు. మూడు రోజుల వ్యవధిలోనే 20 లక్షల లడ్డూలు భక్తులకు అందుబాటులో ఉంచటం రికార్డు అన్నారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ మాట్లాడుతూ, శాస్త్రోక్తంగా పాంచరాత్ర దీక్ష మేరకు ఐదు రోజుల పాటు భవానీ దీక్షల విరమణల కార్యక్రమాన్ని నిర్వహించారని, అర్చక సిబ్బంది శతచండీ యాగాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారని తెలిపారు. 44 సంవత్సరాలుగా దీక్ష విరమణలు కొనసాగుతున్నాయని 9మందితో ప్రారంభమైన దీక్షలు తొమ్మిది లక్షలకు చేరుకోవడం విశేషమన్నారు. ప్రధాన అర్చకులు, ముఖ్య అర్చకులు అందరూ కార్యక్రమాల నిర్వహణకు ఎంతో సహకరించారని తెలిపారు. దేవస్థాన గురుభవానీ యద్దనపూడి నాగరాజ శర్మ ఐదురోజులపాటు ఇక్కడే ఉండి సూచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రత్నరాజు, ప్రధాన అర్చకుడు ఎల్డీ ప్రసాద్, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ఐదురోజుల్లో కనకదుర్గమ్మను దర్శించుకున్న 3.70 లక్షల మంది భక్తులు

ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి భవానీ దీక్షల విరమణల కార్యక్రమంలో 25వ తేదీ సాయంత్రం వరకు 3,70,114 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ప్రకటించిన వివరాల మేరకు.. 21వ తేదీ నుంచి 25వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 3,70,114 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 20 లక్షల లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేయగా, బుధవారం సాయంత్రం వరకు 17,48,837 లడ్డూలను విక్రయించారు. అన్నప్రసాదం, అల్పాహారాలు కలిపి మొత్తంగా 1,34,000 మందికి అన్నవితరణ చేశారు. 55,629 మంది భక్తులు కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించారు. 7,65,910 మంచి బాటిళ్ల భక్తులకు పంపిణీ చేశారు.

అంతరాలయ దర్శనాల్లో కానిస్టేబుల్ అత్యుత్సాహం!

- అర్చకులు, సిబ్బందికి బెదిరింపులు



వన్‌టౌన్ : దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ పురస్కరించుకుని విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. తన మాట వినలేదని, ఆలయ సిబ్బంది, అర్చకులను బెదిరింపులకు గురిచేశాడు. దేవస్థానం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా అంతరాలయంలోకి పంపాలంటూ కానిస్టేబుల్ బెదిరించాడని విధుల్లో ఉన్న ఆలయ సిబ్బంది, అర్చకులు ఆరోపించారు. దీక్షల విరమణలో పోలీసు అధికారులు వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుళ్లకు కొండపైన ప్రొటోకాల్ విధులు అప్పగించారు. వీరిలో ఒక కానిస్టేబుల్ ప్రొటోకాల్ పేరుతో ఇష్టానుసారంగా తన వెంట పది నుంచి పదిహేను మందిని దర్శనానికి తీసుకువెళుతుండటంతో అంతరాలయం వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగులు అడ్డుకున్నారు. దీంతో నన్నే అడ్డుకుంటారా అంటూ బెదిరిస్తున్నాడని, అతడికి గుడిపైనే డ్యూటీ ఉండటం వలన ఉద్యోగులతో పాటు అర్చకులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.



రామ్మోహన గ్రంథాలయంలో వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, బుద్ధప్రసాద్‌లు

ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి వాజ్‌పేయి

- ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్

గవర్నర్‌పేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రతిష్ఠను ప్రపంచ వేదికల మీద నిలపిన గొప్ప విలువలు కలిగిన వ్యక్తి అటల్ బిహారి వాజ్‌పేయి అని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి 100వ జయంతిని (సుపరిపాలన దినోత్సవం) సందర్భంగా బుధవారం ఎంజీ రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయం పైభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంను ఆయన ప్రారంభించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జరిగిన సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి దేశ సేవలో గడిపిన వాజ్‌పేయినిలోని దేశభక్తిని గుర్తించిన పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో అంతర్జాతీయ సభలకు భారత ప్రతినిధిగా పంపారని గుర్తుచేశారు. వాజ్‌పేయి జన్మదినాన్ని సుపరిపాలన దినంగా జరుపుకోవడం మన కర్తవ్యమన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, వాజ్‌పేయి జాతికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన స్ఫూర్తిగా నేటి తరం నేతలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేములపల్లి కేశవరావు, సామాజికవేత్త ఎంసీ దాసు, కమిటీ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆదర్శనీయుడు : ఎంపీ శివనాథ్



వన్‌టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో వాజ్‌పేయి చిత్రపటం వద్ద బుధవారం ఎంపీ నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాజ్‌పేయి అధికారం కోసం ఎప్పుడూ అవకాశవాద రాజకీయాలు చేయలేదన్నారు. నైతిక విలువలకు పట్టం కట్టారని, ప్రతికూల పరిస్థితుల్లో కూడా నైతికతకు కట్టుబడి పదవులు సైతం త్యాగం చేశారని కొనియాడారు. దేశ రాజకీయాల్లో వాజ్‌పేయి చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఎంతటి సంక్లిష్ట విషయాన్ని అయినా సరళ భాషలో చెప్పడం ఆయన శైలి అని కొనియాడారు.

28న కృష్ణా జిల్లాలో ఏకసభ్య కమిషన్ బృందం పర్యటన

మచిలీపట్నంటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయ సేకరణకు ఈనెల 28న కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలతో పాటు నూజివీడు, కైకలూరు మండలాల్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ బృందం పర్యటించనుంది. ఎస్సీ వర్గీకరణపై ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు కమిషన్ పర్యటించనుంది. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జిల్లాల్లో పర్యటించనుంది. దీనిలో భాగంగా మచిలీపట్నం జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో 28న ఉదయం సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాలు, ఉపకులాల్లోని వర్గీకరణపై ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన నేతలు విజ్ఞప్తులు స్వీకరిస్తారు. సామాన్య ప్రజలతో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ కులసంఘాల నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అవకాశం కల్పించారు. మెయిల్ ద్వారా జనవరి 9 వరకు విజ్ఞప్తులు స్వీకరించనున్నట్టు జిల్లా అధికారులు పేర్కొన్నారు.

పురాతన బురుజు తొలగింపుపై రగడ!

- ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు బందుల దొడ్డి నిర్వహణ బాధ్యత
- పనులు అడ్డగించి స్థానికుల నిరసన
- చెరువుబజార్‌లో ఉద్రిక్తత



కూల్చేసిన కోట మైసమ్మ బురుజు, బందులదొడ్డి గేటు ముందు నిరసన తెలుపుతున్న చెరువుబజార్ వాసులు

జగ్గయ్యపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పురపాలకసంఘం బందులదొడ్డి నిర్వహణ బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు సంస్థ చేపట్టి దొడ్డిలో ఉన్న కోట మైసమ్మతల్లి పురాతన బురుజును తొలగించడం స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. చెరువుబజార్‌లో రేణుకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదురుగా ఎంతోకాలంగా బందులదొడ్డిని పురపాలకసంఘం నిర్వహిస్తోంది. దొడ్డిలో వందల సంవత్సరాల క్రితం ఉన్న కోట మైసమ్మ బురుజును కాంట్రాక్టు సంస్థ తొలగించడాన్ని స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఎంతోకాలంగా పుట్టరూపంలో ఉండే బురుజు వద్ద ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలు జరిగినా అక్కడ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తామని, అటువంటి బురుజును తొలగించటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలకసంఘం బందులదొడ్డి నిర్వహణ భారం కావటంతో ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయివేటు సంస్థకు అప్పగించారు. సదరు సంస్థ ప్రతినిధులు కొద్దిరోజులుగా బందులదొడ్డిలో ఉన్న చెత్తా చెదారం తొలగించి గోడలను రేకులతో ఎత్తు పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం బురుజును యంత్రాలతో తొలగించారు. పురాతన కాలంలో పుట్టమట్టితో నిర్మించిన బురుజును తొలగించడంతో స్థానికులు అభ్యంతరం చెబుతు పనులను అడ్డుకున్నారు. బందులదొడ్డి పేరు తొలగించి శ్రీలీలా గోపాల గోసదన్ పేరుతో గోశాలను ఏర్పాటుచేస్తున్నట్టు బోర్డులు పెట్టడంతో వాటిని స్థానికులు తొలగించారు. గోశాల, బందులదొడ్డి నిర్వహణకు తమకు అభ్యంతరం లేదని, ఆ పేరుతో వందల సంవత్సరాలుగా పూజలందుకుంటున్న కోట మైసమ్మ తల్లి బురుజును తొలగించటం తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పురపాలకసంఘం అధికారుల పర్యవేక్షణ లేకుండానే ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యంగా కూల్చటమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, బందులదొడ్డి నిర్వహణ పురపాలకసంఘానికి భారంగా మారిందని, బందుల దొడ్డిని అభివృద్ధి చేస్తామని మెసర్స్ స్పేస్‌నెట్ సంస్థ ముందకురావటంతో అప్పగించామని పేర్కొన్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా, అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న ఆవులను ఈ గోసదన్‌లో ఉంచి పోషించటం జరుగుతుందని చెప్పారు.



పతకాలు సాధించిన స్కేటర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ స్కేటింగ్‌లో సత్తా చాటిన ఉమ్మడి కృష్ణా క్రీడాకారులు

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మైసూరు, కోయంబత్తూర్‌లలో ఈనెల 15 వరకు జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లా రోలర్ స్కేటర్లు పతకాల పంట పండించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, అధ్యక్షులు జె.దుర్గాప్రసాద్, కోశాధికారి సోంతాతియా, ఉపాధ్యక్షులు ఎల్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షులు బచ్చు మురళీకృష్ణలు క్రీడాకారులను అభినందించారు.

నేడు ఫెన్సింగ్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు : వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో ఏకత్వా పాఠశాలలో ఈ నెల 26న సాయంత్రం 3 గంటలకు ఉమ్మడి కృష్ణా అండర్-17 ఫెన్సింగ్ క్యాడెట్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ నాగం సతీష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈనెల 28, 29వ తేదీల్లో కాకినాడ ఏడీబీ రోడ్డులో ఉన్న లక్ష్య అంతర్జాతీయ పాఠశాలలో జరిగే 10 ఏపీ అంతర్ జిల్లాల అండర్-17 ఫెన్సింగ్ క్యాడెట్ పోటీలకు పంపుతామన్నారు. ఇతర వివరాలకు 9553528888 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగునీటి కష్టం

(5వ పేజీ తరువాయి)



సాగునీటి తూములు విరిగిపోవటంతో ఏనుగుల కోడు డ్రెయిన్‌లో కలుస్తున్న సాగునీరు

వర్షాలు ఎన్నిక కావటంతో సాగునీటి సమస్యలను పరిష్కరించుకునే అవకాశం లభించింది. నీటి వినియోగదారుల సంఘాలకు నిధులు కూడా వస్తాయంటున్నారు. దాంతో సాగునీటి తూములు నిర్మిస్తారనే ఆశలు రైతుల్లో ఏర్పడ్డాయి. నీటి సంఘాల చైర్మన్‌లు ఇరిగేషన్ అధికారులతో అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరు చేయంచగలిగితే వచ్చే వేసవిలో ఈ సాగునీటి తూములను పునర్నిర్మించేందుకు వీలు కలుగుతుంది. దీనికి ఇప్పటి నుండే కార్యాచరణ అవసరం.



తుములను పునర్నిర్మించేందుకు కృషి

- రామినేని వెంకట రామారావు, పెనమకూరు సంఘం చైర్మన్

ఏనుగులకోడు డ్రెయిన్‌పై విరిగిన సాగునీటి తూములను మళ్లీ పటిష్టంగా నిర్మించేందుకు కృషి చేస్తాను. ఈ సమస్యపై అవగాహన కూడా ఉంది. ఇలాంటి సమస్యలను మీడియా కూడా తన దృష్టికి తీసుకువస్తే ఖచ్చితంగా పరిష్కారానికి ప్రయత్నిస్తా.

సహకార రంగ అభివృద్ధికి ప్రణాళిక

- మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార రంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. బుధవారం తాడేపల్లిలో సహకారంతో సంవృద్ధి పేరుతో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, 2023 నుంచి రిజిస్టర్ అయిన బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల ఉత్పత్తిదారుల సంఘాలు, మత్స్యకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 932 మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రోజుకు 1.60 కోట్ల లీటర్ల పాలు డెయిరీలకు సరఫరా అవుతున్నాయని తెలిపారు. పాల ఉత్పత్తిదారులు లాభదాయక ధర పొందటానికి కొత్తగా ఏర్పడిన సంఘాలకు పాల పరీక్ష యంత్రాలు, శీతలీకరణ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పాల వ్యాపార నిర్వహణపై శిక్షణ ఇస్తామని, పశుగ్రాస పెంపకందారులు, పాడి రైతులు అదనపు ఆదాయం పొందటానికి ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సహకార సంఘాలకు నగదు ఉపసంహరణ పరిమితిని ఏడాదికి రూ.కోటి నుంచి రూ.3 కోట్లకు పెంచామన్నారు. మత్స్యకార సంఘాల సభ్యులకు బోట్లు, వలలు, చేపపిల్లల పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి, సహకార సంఘాలకు ఆదాయ పన్నును 30 శాతం నుంచి 15 శాతానికి కుదించినట్టు అచ్చెన్నాయుడు చెప్పారు.

3 లోగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు : రంగా వర్సిటీ

అమరావతి : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుకు జనవరి 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ రామచంద్రరావు సూచించారు. చిరుధాన్యాల సాగు, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రెండు నెలలు ఆన్‌లైన్ కోర్సు నిర్వహించనున్నట్టు ఆయన వివరించారు. ఆసక్తి కలవారు రంగా వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా 9063219959, 8309626619 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఐసీఐ విజయవాడ చాప్టర్ చైర్మన్‌గా జగదీష్

అమరావతి : ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) విజయవాడ చాప్టర్ చైర్మన్‌గా డాక్టర్ జగదీష్ వెంగల నియమితులయ్యారు. 2026 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. విజయవాడలోని పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ జగదీష్ పరిశ్రమలు, సిద్ధాంతం, పరిశోధనల్లో రెండు దశాబ్దాలుగా పైగా అనుభవం గడించారు. అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్న నేపథ్యంలో కాంక్రీట్ నాణ్యతను మెరుగుపరచడంలో ఐసీఐ పాత్ర కీలకమని పీవీపీ సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివాజీబాబు తెలిపారు. ఐసీఐ విజయవాడ చాప్టర్ నూతన చైర్మన్ డాక్టర్ జగదీష్ కాంక్రీట్ సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు, వృత్తిపరమైన అభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు.

దివ్య ఆచూకీ తెలపండి..

- బహుమతి ప్రకటించిన పోలీసులు



అవనిగడ్డ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14వ తేదీ నుంచి కనిపించకుండాపోయిన ఆవుల దివ్య ఆచూకీ కోసం పోలీసుశాఖ పారితోషకాన్ని ప్రకటించింది. అవనిగడ్డ లంకమ్మ మాన్యం వంతెన వద్ద గుడిసెల్లో నివాసముంటున్న ఆవుల గోపి, కొండాలమ్మల కుమార్తె అయిన దివ్య మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోగా, ఆమె ఆచూకీ కోసం పోలీసులు జిల్లా వ్యాప్తంగా గాలింపు చేపట్టారు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి ఉంటుందని భావించి విచారణ చేపట్టిన పోలీసులకు ఫలితం లేకపోవటంతో, ఆచూకీ తెలిపిన వారికి పారితోషకం ఇస్తామని ప్రకటించారు. దివ్య ఆచూకీ తెలిసిన వారు 9440796406 (డీఎస్పీ అవనిగడ్డ), 9440796466 (సీఐ, అవనిగడ్డ), 9440796467 (ఎస్‌ఐ, అవనిగడ్డ) పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కోరింది.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

మైలవరంరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుక్కలు దాడిచేయడంతో 60 గొర్రెపిల్లలు మృతిచెందిన ఘటన మండలంలోని చంద్రగూడెంలో మంగళవారం రాత్రి జరిగింది. మైలవరానికి చెందిన పాలెం రామారావు, కుటుంబరావులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రగూడెం-అనంతవరం మార్గమధ్యలోని పొలంలో గొర్రెలను మేపుకుంటూ జీవనంసాగిస్తున్నారు. మంగళవారం ఉదయం గొర్రెలను మేత నిమిత్తం బయటకు తోలుకొని వెళ్లగా, మిగిలిన గొర్రె పిల్లలను పొలంలో ఉంచి వెళ్లారు. ఊర కుక్కలు మెష్ కింద మట్టి తవ్వుకొని లోపలికి దూరి గొర్రె పిల్లలపై దాడి చేయడంతో 60 పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల యజమానులు సాయంత్రం వచ్చి చూడగా గొర్రెపిల్లలు చనిపోయి ఉన్నాయి. రూ.3లక్షల నష్టం వాటిల్లడంతో జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

జనవరి 3, 4 తేదీల్లో యువకెరటాలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువతీ యువకుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు జనవరి 3, 4 తేదీల్లో హిందూ కళాశాల ప్రాంగణంలో 'యువకెరటాలు' కార్యక్రమం నిర్వహించనున్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. జనవరి 3న పాఠశాలల విద్యార్థులకు, 4న కళాశాల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్, గ్రూపు డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పోలీసుశాఖ ఆయుధ ప్రదర్శన, ఇస్రో, ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, విపత్తు నిర్వహణ, డ్రోన్స్, ఎన్డీఆర్ఎఫ్ ప్రదర్శన నిర్వహిస్తారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంఎస్ఎంఈ వంటి అంశాలలో పారిశ్రామిక వేత్తలతో అవగాహన కల్పిస్తారు. మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో యువకులకు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రముఖ కళాకారులు,ప్రజాప్రతినిధులు పాల్గొనేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందుకుగాను వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు.

హేలాపురి బాలోత్సవ్‌కు రూ.30 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జనవరిలో ఏలూరులో నిర్వహించనున్న హేలాపురి బాలోత్సవ్ వేడుకలకు మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు రూ.30వేలు విరాళం అందించారు. బుధవారం స్థానిక మానవత కార్యాలయంలో హేలాపురి బాలోత్సవ్ వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలోత్సవ్ నిర్వాహకులు ఆలపాటి నాగేశ్వరరావు, జీవీఎల్ నరసింహారావులకు చెక్కును అందజేశారు. మారుబోయినతో పాటు మానవత సభ్యులు మంటా సత్యనారాయణ, ఇందిరాదేవి దంపతులు కూడా రూ.6వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో మానవత సభ్యులు జీవీ. సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, చెక్కా సుబ్బారావు, కొట్నేని రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు జననం లోకానికి వెలుగు

- జానంపేట వియాన్ కాలేజీ రెక్టర్ రెవ.ఫాదర్ ప్రవీణ్ గోపు, తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు
- వాడవాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఉంగుటూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు జననం లోకానికి వెలుగు అని జానంపేట వియాన్ కాలేజీ రెక్టర్ రెవ.ఫాదర్ ప్రవీణ్ గోపు, తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు అన్నారు. పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ పర్వదిన వేడుకలు మత గురువుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి, బుధవారం ఉదయం జరిపిన దివ్యపూజను జానంపేట వియాన్ కాలేజీ రెక్టర్ రెవ.ఫాదర్ ప్రవీణ్ గోపు సమర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి, దివ్యసత్ప్రసాదాన్ని అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రైస్తవులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. దివ్యపూజలో తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ జోసఫ్ పాలడుగు, విచారణ గురువు ఫాదర్ అభిలాష్ గోపు పాల్గొన్నారు.


పెద అవుటపల్లిలో దివ్యపూజలో పాల్గొన్న ఫాదర్లు ప్రవీణ్, జోసఫ్,అభిలాష్


ముదునూరు చర్చిలో పాల్గొన్న జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి


దివ్యసత్ప్రసాదం పంపిణీ చేస్తున్న ఫాదర్ జోసఫ్

బాలయేసు మందిరంలో ..

హనుమాన్ జంక్షన్ : జంక్షన్ ప్రాంతంలోని పలు చర్చిల్లో మతస్తులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి చర్చిలు ప్రత్యేక ప్రార్థనలతో మారుమ్రోగాయి. చర్చిలు, విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోయాయి. స్థానిక గుడివాడ రోడ్డులోని టౌన్ చర్చి, జ్యోతినగర్ బాలయేసు మందిరంలో ఫాదర్ జోసెఫ్ తంబి, నూజివీడు రోడ్డులోని కారుణ్య చర్చిలో రవి పొంట, హోసన్నా మందిరంలో దేవదాసు, బాపులపాడు సీఎస్ఐ చర్చిలో అనిల్‌కుమార్, హనుమాన్‌నగర్ ఎల్ఈఎఫ్ చర్చిలో పాస్టర్ డి.పాల్ ఆధ్వర్యంలో మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు..


రంగన్నగూడెంలో..

రంగన్నగూడెంలోని సీఎస్ఐ చర్చిలో ..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని ఎన్ఎస్‌పీ ఏడ మ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలోని సీఎస్ఐ చర్చిలో సంఘ కాపరి బట్టు చంద్రరావు ఆధ్వర్యంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించి ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ సభ్యుడు కనకవల్లి శేషగిరిరావు, టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ నత్తా ప్రసన్న రావు, కసుకుర్తి చంద్రబోస్, చర్చి కమిటీ పెద్దలు దోమవరపు బాబూరావు, ఇలపర్తి సంసోను, తలారి యోహాను, యాకోబు పాల్గొన్నారు.

మెస్సీయ పెంతుకోస్తు చర్చిలో ..

గన్నవరం : మానవాళి పాపాల నుంచి రక్షించేం దుకు ప్రభువైన ఏసుక్రీస్తు భూమి మీదకు వచ్చారని పాస్టర్ అన్నే సోలోమాను అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం మెస్సీయ పెంతు కోస్తు చర్చిలో పాస్టర్ సోలో మాను ప్రసంగిస్తూ లోక రక్షకుడు జననానికి గుర్తుగా క్రిస్మస్ అని పేర్కొన్నారు. క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడ వాలని చెప్పారు. ఎదుటి వారి పట్ల ప్రేమ దయ జాలి కరుణ చూపాలని తెలిపారు. ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో క్రీస్తును ప్రార్థించాలని చెప్పారు.


కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో..

ఉయ్యూరులో..

ఉయ్యూరు : క్రిస్మస్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉయ్యూరు ఐలో బెన్నిట్ చర్చి, ఇమ్మానుయేల్ చర్చి, సీఎస్ఐ చర్చిలతో పాటు ఇతర చర్చిలలో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముదునూరు, ఇతర ప్రాంతాల చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి పాల్గొని, స్వీట్లు పంపిణీ చేశారు.

తాడిగడప మునిసిపాలిటీలో..

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీలోని యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడపల్లో ఉన్న చర్చిలలో క్రైస్తవ సోదరులకు ఫాదర్‌లు క్రిస్మస్ ప్రాముఖ్యతను తెలియజెప్పి పవిత్ర ప్రార్థనలు చేశారు. కానూరు కార్మెల్‌మాత పుణ్యక్షేత్రంలో క్రీస్తు జన్మదినం సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. దివ్యబలి పూజలో గంగూరు, సాలిపేట, పోరంకి, కామయ్యతోపు, కానూరు ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతీల నుండి హాజరయిన భక్తులకు క్రీస్తు సూక్తులను వివరించారు. చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాక, క్రిస్మస్ తాత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చర్చిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

స్వయం ఉపాధి వైపు యువత మొగ్గుచూపాలి

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, డిసెంబరు 25 (ఆంధ్ర జ్యోతి) : ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాల వేటలో నగరాలు, పట్టణాలకు పరుగులు తీయకుండా చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారం వంటివి ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధికి బాటలు వేసుకుని మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక కాటూరు రోడ్డులో ఉన్నత విద్యనభ్యసించి వ్యాపార రంగంలో అడుగిడిన పడమట ఫణీంద్రబాబుకు చెందిన ఎడోర్ ఈట్స్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ డబ్బుల కోసం దాడి

పెనమలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వడ్డీతో సహా అసలు చెల్లించినా మరింత వడ్డీ కావాలని వేధించి దాడికి పాల్పడ్డ వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోరంకికి చెందిన కొడాలి సతీష్‌బాబు, గంగూరు డొంకరోడ్డుకు చెందిన మాదల ప్రసాద్ వద్ద సంవత్సరం క్రితం అప్పుగా కొంత డబ్బు తీసుకొన్నాడు. కొన్నాళ్ల తర్వాత సతీష్‌బాబు ప్రసాద్‌కు వడ్డీ, అసలు మొత్తం చెల్లించాడు. అయినా మరికొంత వడ్డీ చెల్లించాలని గత రెండు నెలలుగా ప్రసాద్ అర్ధరాత్రివేళ అపార్టుమెంట్ వద్దకు వచ్చి సతీష్‌బాబు, అతని భార్యపై దాడిచేసి గాయపరచాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైర్ల చోరీపై ఫిర్యాదు

పోరంకిలోని ఒక ప్రైవేటు రియల్ ఎస్టేట్ వెంచర్లో స్టోర్ రూంను బద్దలు కొట్టి షుమారు రెండు లక్షల విలువైన విద్యుత్ వైర్లను అక్కడ పనిచేసే వ్యక్తులే దొంగిలించారని సూపర్‌వైజరు యలమించిలి వెంకటసాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


రైతులతో మాట్లాడుతున్న కంకిపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని రత్నభూషణ్, యుగంధర్ ప్రసాద్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రసాదంపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం లాటిదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గన్నవరం నియో జకవర్గంలో వివిధ ఆరోగ్య కారణాలతో బాధపడుతూ వైద్యం చేయించుకుంటున్న మానికొండ గ్రామానికి చెందిన బెజవాడ కృష్ణారావుకు రూ.60 వేలు, నున్న గ్రామానికి మాణిక్యంకు రూ. 2,25,000ల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మం జూరైన ఎల్‌వోసీ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ఎన్నో కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆపద్బంధువునిగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు.


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


శైలజకు సీఎం ఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

ఉయ్యూరు : బోళ్లపాడుకు చెందిన గుంటక శైలజ వైద్యఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి రూ. 3.5 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం అందజేశారు. శైలజ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా దరఖాస్తు చేసుకుంది. ఆ మేరకు మంజూరైన మొత్తానికి సంబంధించి ఎల్‌వోసీని అందజేశారు. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, టీడీపీ నాయకులు కె.వాసు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి

పెనమలూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని, బీజేపీ సీనియర్ నాయకులు, స్వర్గీయ అటల్ బీహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం కానూరు వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆశ్రమంలోని వృద్ధుల సమక్షంలో కేకును కోసి పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వల్లూరి శ్రీమన్నారాయణ, కిసాన్ మోర్చా కృష్ణా జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, భారతదేశాన్ని ఏకతాటిపైకి తెచ్చి దేశ యువతలో స్ఫూర్తిని నింపి ప్రపంచ పటంలో భారతదేశానికి సరైన గుర్తింపు తెచ్చిన యోధుడు వాజ్‌పేయి అని కొనియాడారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువమోర్చా నాయకులు మావులూరి ప్రఖ్యాత్, బందెల నిఖిల్, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా కృష్ణాజిల్లా అధ్యక్షులు గోపిశెట్టి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు వల్లూరి శ్రీమన్నారాయణ

సాగునీటి కాల్వల నిర్వహణపై రైతులతో ముఖాముఖి

ఉయ్యూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కాల్వల నిర్వహణ, స్థితిగతులపై కంకిపాడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవినేని రత్నభూషణ్ బుధవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గండిగుంటలో ఉయ్యూరు సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నాదెళ్ల యుగంధర్ ప్రసాద్ నివాసం వద్ద స్థానిక రైతులతో సమావేశమయ్యారు. ఉయ్యూరు సంఘం పరిధిలో కాల్వల పరిస్థితిని అడిగి తెలుసుకుని కాల్వల నిర్వహణ, చివరి భూములకు కూడా సాగునీరందేందుకు అవసరమైన చర్యలు, సూచనలు తెలుసుకున్నారు. ఇరిగేషన్ డీఈ వీరాంజనేయులు, కంకిపాడు ఏఈ నాగబాబు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

- పదిమంది అరెస్టు

ఉయ్యూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆకునూరు గ్రామపరిధిలో బుధవారం కోడిపందేల స్థావరంపై దాడి చేసి పందేలు వేస్తున్న పదిమందిని అరెస్ట్‌చేసి వారి వద్దనుంచి రూ. 3,370 నగదు, ఆరు బైకులు, ఒక కోడిపుంజు, కోడికత్తులు స్వాధీన పరుచుకున్నట్టు రూరల్ ఎస్సై కె. సురేశ్‌బాబు తెలిపారు. కోడిపందేలు, పేకాట, చిత్తులాట ఆడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. పందేలు నిర్వహిస్తున్న అధికార పార్టీకి చెందిన వారిని తప్పించి, చూసేందుకు వెళ్లిన వారిని అరెస్టు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు!

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- వాహనాల వెంట పరుగులు
- తరచూ పిల్లలు, వృద్ధులపై దాడులు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కు వైంది. పగలు, రాత్రి తేడా లేకుండా గుంపులు గుంపులుగా వీధుల్లో సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. రోడ్లవెంట పెద్దగా అరుస్తూ ఒక దానినొకటి కరుచుకుంటూ, కొట్లాడుకుంటూ ఉరుకులు, పరుగులు పెడ్తుంటే జనం భయంతో బెంబేలెత్తిపోతున్నారు. రాత్రివేళల్లో విధులు ముగించుకుని ఒంటరిగా ఇంటికి చేరుకునే ఉద్యోగులు ప్రతిరోజూ బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సిందే, ముఖ్యంగా. వీధుల్లో ఒంటరిగా నడిచివెళ్తున్న మహిళలు, పిల్లలు, వృద్ధులతోపాటు రోడ్లపై వెళ్తున్న వాహనాల మీదకు ఒక్క సారిగా కుక్కలు దూసుకువచ్చి గాయపరుస్తున్నాయి. ఏ సమయంలో కుక్కలు ఎటువైపునుంచి వచ్చి దాడిచేస్తాయోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు తప్పని బెడద

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వీధి కుక్కలకు ఆవాసంగా మారింది. కార్యాలయం పక్కన వరిపొలాలు వుండటంతో ఎలుకల వేటకోసం గుంపులుగా వచ్చిన శునకాలు గత కొంతకాలంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోనే తిష్టవేశాయి. ఎటువంటి నదురు బెదురు లేకుండా ఎంపీడీవో కార్యాలయం ఎదుట సేదతీరుతూ రోజూ విధులకు హాజరయ్యే కార్యాలయ సిబ్బందిని, వివిధ సమస్యల మీద కార్యాలయానికి వచ్చే ప్రజలను భయపెడుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం 10గంటలకు కార్యాలయం తలుపులు తెరిచే క్రమంలో అడ్డుగా పడుకున్న ఏడెనిమిది శునకాలను కర్రతో గేటు బయటకు తరిమికొట్టేందుకు ప్రయత్నించడం, అవి ఏమాత్రం బెదరకుండా పెద్దగా అరుస్తూ ప్రాంగణంలోపల పరుగులు పెడుతుండటం నిత్యకృత్యమైపోయింది. కుక్కల అరుపులు, కొట్లాటల వల్ల కార్యాలయ అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.


ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గుంపులుగా సేదతీరుతున్న శునకాలు

శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల సాయం

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న రేవతి కుమారుడు శ్రీతేజ్‌ను బుధవారం దిల్ రాజుతో కలిసి అల్లు అరవింద్ మరోసారి పరామర్శించారు శ్రీతేజ్ ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద అల్లు అరవింద్ మాట్లాడుతూ.. శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు వైద్యులు చెప్పారని తెలిపారు. శ్రీతేజ్ శరీరంలో పూర్తి స్థాయిలో కదలికలు వచ్చాయని చెప్పారన్నారు. అతని ఆరోగ్యం పూర్తిస్థాయిలో మెరుగు పడేంతవరకు అన్నిరకాల వైద్య చికిత్సలు అందించడానికి తమవైపు నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని మనందరితో కలిసి తిరుగుతాడని ఆశిస్తున్నట్లు చెప్పారు. వారి కుటుంబానికి చేయదలచుకున్న ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా దిల్ రాజుకు అందజేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఆ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నాం..

శ్రీతేజ్ కోలుకుంటున్నాడని, వెంటిలేటర్, ఆక్సిజన్ లేకుండా 72 గంటలుగా శ్వాస తీసుకోగలుగుతున్నాడని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. అతని కుటుంబానికి అల్లు అర్జున్, నిర్మాతలు, దర్శకుడి తరఫున రూ.2 కోట్ల సాయం అందజేశామన్నారు. గురువారం సినీ పరిశ్రమకు చెందిన పెద్దలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తున్నామని చెప్పారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో సినీ పరిశ్రమ ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పరామర్శించారు. సినిమా కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ తరఫున అండగా ఉంటామని చెప్పారు.

జానీ మాస్టర్ లైంగిక వేధింపులు నిజమే

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సినీ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. అతను తన వద్ద పనిచేసిన సహాయ నృత్య దర్శకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు చార్జిషీట్ దాఖలు చేశారు. జానీ మాస్టర్ ఆమెను ఈవెంట్ల పేరుతో పలు ప్రాంతాలకు తీసుకువెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత యువతి సెప్టెంబరు 15న పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. నార్సింగ్ పోలీసులు జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించగా, కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అక్టోబరు 25న విడుదలయ్యాడు.

జనవరి 21న కృష్ణా బోర్డు భేటీ

అమరావతి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం వచ్చే నెల 21వ తేదీన జరుగనుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు బోర్డు సమాచారం పంపింది. బోర్డు ఆర్థిక వ్యవహారాలు, రెండు రాష్ట్రాలూ ఇవ్వాల్సిన నిధులు, బోర్డు విధివిధానాల ఖరారు, అమరావతికి బోర్డు తరలింపును ఉమ్మడి ఎజెండాలో చేర్చింది. ఆంధ్రప్రదేశ్ ఆరు చర్చనీయాంశాలను ప్రతిపాదించింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణకు తిప్పి పంపిన నేపథ్యంలో ఈ భేటీలో బోర్డు ఏం చెబుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అలాగే బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తామని ఇటీవల జలశక్తి శాఖ తెలిపింది. 21న జరిగే భేటీలో అయినా దీనిని తేల్చుతారా.. ఎప్పటి మాదిరిగానే దాటవేస్తారా అనే సందేహం నెలకొంది. విభజన చట్టం ప్రకారం ఏనాడో విజయవాడలో కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అప్పట్లో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. కృష్ణా నదితో ఎలాంటి సంబంధమూ లేని విశాఖకు ఈ కార్యాలయాన్ని తరలించాలని ప్రతిపాదించారు. దీనిని కేఆర్ఎంబీ కూడా గుడ్డిగా సమర్థించింది.

అమ్మ వచ్చింది!

పాతికేళ్ల తర్వాత కలుసుకున్న తల్లీపిల్లలు

- ఉద్వేగంతో ఉబ్బితబ్బిబ్బయిన కుటుంబం
- పెళ్లికి వెళ్లి తప్పిపోయిన సాకమ్మ
- అధికారుల చొరవతో నిరాశ్రయుల కేంద్రం నుంచి ఇంటికి



ఎయిర్‌పోర్టులో తల్లిని హత్తుకుని విలపిస్తున్న కుమారులు

ఇరవై ఐదేళ్ల క్రితం అదృశ్యమైన అమ్మ... ఒక్కసారిగా కళ్లముందు ప్రత్యక్షం. అంతే, ఆ పిల్లలు ఉద్వేగానికి గురయ్యారు...కట్టలు తెంచుకుని వచ్చిన కన్నీళ్లను తుడుచుకుని కన్నతల్లిని హత్తుకున్నారు. వారిని చూడగానే ఆ తల్లి పరిస్థితీ అంతే...పిల్లలను ఈ జన్మలో చూస్తానో చూడనో అంటూ తపించి, తల్లడిల్లుతున్న మాతృహృదయానికి ఎట్టకేలకు సాంత్వన చేకూరింది.

సాకమ్మ... పాతికేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం హొసపేటలో బంధువుల ఇంట పెళ్లికి వెళ్లి పొరబాటున వేరే రైలు ఎక్కేశారు. ఆరైలు రాష్ట్రాల సరిహద్దులు దాటిపోయింది. రైలు దిగి ఎక్కడెక్కడో తిరిగి సాకమ్మ హిమాచల్‌ప్రదేశ్ చేరారు. అక్కడి అధికారులు అనాథ మహిళగా భావించి, మండి జిల్లా నిరాశ్రయుల కేంద్రంలో చేర్పించారు. ఆమెకు మతిస్థిమితం కాస్త సరిగా లేకపోవడంతో ఇలా జరిగింది. ఆమె కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత ఎనిమిది రోజులకు గుర్తు తెలియని మహిళ మృతదేహం చిక్కినట్టు పోలీసులు తెలపడంతో వెళ్లి చూసి, సాకమ్మదే అని భావించి అంత్యక్రియలు కూడా నిర్వహించారు.

ఆ అధికారి చొరవతో..: కర్ణాటకలోని మండ్య జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి రవినందన్ ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. ఆయన సాకమ్మ గురించి తెలుసుకుని, బెంగళూరులోని తన స్నేహితులకు వీడియో పంపించారు. వారు సాకమ్మ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కర్ణాటక సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి పి.మణియణ్ణన్ స్పందించారు. ఐపీఎస్ అధికారి రవినందన్‌ను సంప్రదించి, సాకమ్మ వివరాలను సేకరించారు. ఆమె బళ్లారివాసి అని తెలుసుకుని, ఇక్కడి అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులు, పిల్లలు బళ్లారి నగరంలోని గుగ్గరహట్టిలో ఉన్నట్టు గుర్తించారు. హిమాచల్‌ప్రదేశ్‌కు అధికారుల బృందం వెళ్లి...వీడియో కాల్ చేసి కుమారుడు విరాట, కూతురు లక్ష్మిని సాకమ్మకు చూపించి, మాట్లాడించారు. ఆమెను చూసి గుర్తుపట్టిన ఆ కుటుంబం ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. అధికారుల బృందం ఆమెను హిమాచల్ ప్రదేశ్ నుంచి విమానంలో మంగళవారం రాత్రి బెంగళూరుకు తీసుకు వచ్చింది. అప్పటికే ఎయిర్ పోర్టుకు చేరుకున్న సాకమ్మ ఇద్దరు కుమారులు తల్లిని చూడగానే ఉద్వేగంతో కళ్లనీళ్లు పెట్టుకున్నారు. సంక్షేమ శాఖ ఉన్నతాధికారి మణియణ్ణన్ బుధవారం సాకమ్మను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రత్యేక వాహనంలో వారంతా స్వస్థలానికి బయలుదేరారు.

-బళ్లారి గాంధీనగర్, ఆంధ్రజ్యోతి

కర్త, కర్మ, క్రియ.. కేటీఆరే!

ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు.. సీనియర్ ఐఏఎస్ దానకిషోర్ వాంగ్మూలం!

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం.. నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ



దానకిషోర్

హైదరాబాద్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేసి కీలక ఆధారాలు సేకరించారు. రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిస్‌లు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గ ంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎస్‌ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. ఈ క్రమంలో అర్వింద‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటిరెండు రోజుల్లో అర్వింద‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30న ముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసు నుంచి తనను బయటపడేయాలని, అరెస్టు వరకు వెళ్లకుండా చూడాలని అర్వింద‌కుమార్ ప్రభుత్వానికి సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను అప్రూవర్‌గా మార్చుకొని దర్యాప్తులో ముందుకు వెళ్లే యోచన కూడా చేస్తున్నట్లు సమాచారం.

దిశ మార్చుకున్న

తీవ్ర అల్పపీడనం

- నేడు బలహీనపడుతుందన్న వాతావరణశాఖ
- కోస్తా జిల్లాలకు వర్షసూచన.. పెరిగిన చలి

విశాఖపట్నం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి, దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం దిశ మార్చుకుంది. మంగళవారం వరకూ పశ్చిమ నైరుతిగా పయనించిన తీవ్ర అల్పపీడనం తరువాత వాయవ్యంగా పయనిస్తోంది. బుధవారం మధ్యాహ్నానికి దక్షిణ తమిళనాడు, ఉత్తర తమిళనాడుకు సమీపంలో కొనసాగుతోంది. గురువారం నాటికి వాయవ్యంగా పయనించి పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించే క్రమంలో అల్పపీడనంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాలో అనేకచోట్ల బుధవారం ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సముద్రం మీదుగా గాలులు వీయడం, చిరుజల్లులు కురుస్తుండడంతో కోస్తాలో చలి వాతావరణం కొనసాగింది. అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక కొనసాగుతుంది. గురువారం కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, నెల్లూరు జిల్లాలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి తేమగాలులు బలంగా రావడంతో ప్రస్తుతం పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనానికి అవసరమైన తేమ లభిస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

వర్షం రాకతో కొత్త పెట్టె కొనుగోలు!

- పార్శిల్‌లో మృతదేహం కేసులో కొత్త కోణాలు
- ఆస్తి కోసం అక్కనే బెదిరించేందుకు చెల్లెలు, మరిది పన్నాగాలు



గాంధీనగర్‌లోని నిందితుని ఇంటి వద్ద ఉన్న మరో చెక్క పెట్టె

భీమవరం క్రైం/ఉండి/కాళ్ల, డిసెంబరు 25(ఆంధ్ర జ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం యండగండిలో కలకలం రేపిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సాగి తులసి మరిది తిరుమాని శ్రీధర్‌వర్మ(అలియాస్ సుధీర్ వర్మ, అలియాస్ సిద్ధార్థ వర్మ) పోలీసుల అదుపులో ఉన్నాడు. శ్రీధర్‌వర్మ కాళ్ల గ్రామ శివారు గాంధీనగర్‌కు చెందిన బర్రె పర్లయ్యను హత్య చేసి బాక్సులో పెట్టి.. యండగండికి పంపించిన ఘటనలో తులసి చెల్లెలు అయిన రెండో భార్య. రేవతి పూర్తి సహకారం అందించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. మూడో భార్య సుష్మ కూడా సహకారం అందించినట్లు భావిస్తున్నారు.

హత్య కేసుగా మార్పు

ఈ నెల 17న బర్రె పర్లయ్యను హత్య చేసేందుకు శ్రీధర్ వర్మ పక్కా ప్రణాళికతో చెక్క పెట్టెను సిద్ధం చేసుకున్నాడు. మద్యం తాపించి ఉండి మండలం వాండ్రం గ్రామ సమీపంలో హత్య చేశాడు. మృతదేహాన్ని చెక్కపెట్టెలో పార్శిల్ చేయడానికి గాంధీనగర్ తీసుకువెళుతుండగా వర్షం కురవడంతో, కారు ముందుకు వెళ్లే అవకాశం లేకపోయింది. దీంతో శవాన్ని కారులోనే ఉంచి, మరొక పెట్టెను కైకలూరు నుంచికొని తెచ్చాడు. అనంతరం మృతదేహాన్ని గణపవరం మండలం సాగిపాడు వద్దకు పెట్టెలో తీసుకువెళ్లి మూడో భార్య సుష్మ సాయంతో ఆటోకు అప్పగించి తులసికి డోర్ డెలివరీ చేశారు. ఇప్పటి వరకు అనుమానాస్పద కేసుగా ఉంచిన పోలీసులు బుధవారం దీనిని హత్య కేసుగా మార్పు చేశారు. తులసికి చెందిన ఆస్తిని కాజేయడం కోసమే శ్రీధర్‌వర్మ, అతడి రెండో భార్య రేవతి పన్నాగం పన్నారని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. శ్రీధర్ వర్మ రెండో భార్య రేవతి భీమవరంలోని పలు నగల దుకాణాల్లో బంగారం తాకట్టు పెట్టి, మరికొంత విక్రయించినట్లు తెలియడంతో బుధవారం మూడు బంగారం దుకాణాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గాంధీనగర్‌లో మొదటి భార్య ఇంట్లో క్షుద్రపూజలకు సంబంధించిన కొన్ని వస్తువులు, పుస్తకాలు పోలీసులకు దొరికాయి. కృష్ణా జిల్లా మల్లంపూడిలో శ్రీధర్ వర్మ తల్లిదండ్రులను, ఆయన ముగ్గురు భార్యలు, పిల్లలు, యండగండికి చెందిన ముదునూరి రంగరాజు, అతడి భార్య హైమావతి, సాగి తులసిలను పోలీసులు వేర్వేరుగా పలు ప్రదేశాల్లో విచారిస్తున్నారు. ఒకట్రెండ్రోజుల్లో వివరాలు పూర్తిగా వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ నయీం అస్మి తెలిపారు.



మలయాళ రచయిత వాసుదేవన్ నాయర్ కన్నుమూత



ప్రముఖ మలయాళ రచయిత, సినీ దర్శకుడు ఎంటీ వాసుదేవన్ నాయర్ (91) బుధవారం రాత్రి కొళిక్కోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆయన కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. పాలక్కాడ్ సమీపంలోని కడలూరు ఆయన సొంతూరు. వాసుదేవన్ నాయర్‌కు బాల్యం నుంచే మలయాళ సాహిత్యంపై ఆసక్తి కలిగింది. ఆయన కలం నుంచి జాలువారిన బాల సాహిత్యం, కథలు, పర్యాటక రచనలు, వ్యాసాలు, నవలలు మలయాళ సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. 'నాలుకెట్టు, అసురవిత్తు, మంజు, సర్పవిత్తు' తదితర రచనలు విశేష పాఠకాదరణ పొందాయి. కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత మలయాళ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన వాసుదేవన్ 54 చిత్రాలకు స్ర్కీన్‌ప్లే అందించారు. ఏడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'నిర్మాల్యం', 'కడవు' సినిమాలకు ఉత్తమ చిత్రం విభాగంలో జాతీయ చలనచిత్ర పురస్కారాలు దక్కాయి. ఇప్పటివరకూ ఉత్తమ స్ర్కీన్‌ప్లే రచయితగా నాలుగుసార్లు జాతీయ అవార్డు అందుకున్న అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకున్నారు. వాసుదేవన్ రాసిన తొమ్మిది కథల ఆధారంగా తెరకెక్కిన 'మనోరథంగల్' వెబ్‌సిరీస్ ఈ ఏడాది ప్రముఖ ఓటీటీలో విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. ఆయన పైన గౌరవంతో ఈ సిరీస్‌కు కమల్‌హాసన్ సమర్పకుడిగా వ్యవహరించగా, మోహన్‌లాల్, మమ్ముట్టి, ఫహద్ ఫాజిల్ లాంటి పలువురు అగ్రతారలు నటించారు. 1996లో జ్ఞానపీఠ్, 2005లో పద్మభూషణ్, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఆయన అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్య నిర్వాహక సభ్యుడుగా, కేరళ సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా, ఇండియన్ పనోరమ చైర్మన్‌గా ఆయన సేవలందించారు. కొంతకాలం మాతృభూమి వారపత్రికకు సంపాదకుడిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. వాసుదేవన్ నాయర్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

హిట్ అవుతుందని ప్రభాస్ చెప్పారు

హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు లహరిధర్, బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ "ఈ సినిమా కచ్చితంగా మీ అందర్నీ కదిలిస్తుంది. ధర్మకు ఉత్తమ పరిచయ నటుడిగా అవార్డు రావడం పక్కా. కథను నమ్మి నిజాయితీగా చేసిన ప్రయత్నం ఈ సినిమా. చివరి 40 నిమిషాలు సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు. "ఈ సినిమాను నిర్మించే విషయంలో నిర్మాతలు ఎక్కడా రాజీ పడలేదు. నా అభిమాన హీరో ప్రభాస్‌ను కలసినప్పుడు ఈ సినిమాకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. "సినిమా బాగా వచ్చింది. టీజర్, ట్రైలర్ చూసిన ప్రతీ ఒక్కరూ కంటెంట్ బాగుందని మెచ్చుకుంటున్నారు" అని తెలిపారు.





బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600



మృతుడు రంగారావు (ఫైల్)

విద్యుదాఘాతంతో పంచాయతీ స్వీపర్ మృతి

కోడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిట్టల్లంకలో విద్యుదాఘాతంతో పంచాయతీ స్వీపర్ తెనాలి రంగారావు (54) మృతి చెందాడు. రంగారావు బుధవారం వాటర్ ట్యాంక్ నిండటంతో మోటార్ ఆపేందుకు వెళ్లాడు. స్విచ్ ఆపుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మర ణించాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.



వైభవంగా పైడమ్మ ఊయలల సేవ

పెడన, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జాతర ఉత్సవాలు ముగియడంతో బుధవారం పైడమ్మ అమ్మవారికి ఊయలల సేవ నిర్వహించారు. ఊయలల సేవ అనంతరం అమ్మవారు గర్భగుడి ప్రవేశం చేశారు. చిన్నారులను అమ్మవారి ఆశీస్సుల కోసం ఊయలలో కూర్చోబెట్టి ఊపారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పత్తిపాటి జయకృష్ణ, బొల్లా రామచంద్రరావు, కౌన్సిలర్ బొల్లా పద్మావతి, ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు కొల్లూరి రాధాకృష్ణ, కొట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు., ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. జనవరి 5వ తేదీన ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన జరుగుతుందన్నారు.





బందరులో వైభవంగా పడిపూజ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గాంధీబొమ్మ సెంటర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో కేరళ తంత్రి నంబూద్రి పద్మనాభన్ ఆధ్వర్యంలో వైభవంగా దివ్యపడి పూజ నిర్వహించారు. పెద్ద ఎత్తున అయ్యప్పలు ఈ కార్యక్రమంలో పాల్గొని భజనలు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో నిండిపోయిన ఆలయ ప్రాంగణంలో గాయకులు పాడిన అయ్యప్ప గీతాలు ప్రేక్షకుల వీనుల విందు చేశాయి. సంప్రదాయ సిద్ధంగా జరిగిన దివ్య పడిపూజ కార్యక్రమంలోని నగరంలోని నలుమూలల నుంచి వందలాది భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు పుణ్యనదీ జలాలతో అయ్యప్ప స్వామికి సహస్ర కలశాభిషేకం కార్యక్రమం జరిగింది.

మహాపడి పూజోత్సవాలు ప్రారంభం

కోడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోడూరులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద 20వ వార్షిక మండల మహా పడి పూజా మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, అఖండ కలశ స్థాపన, మండపారాధన, ధ్వజారోహణ నిర్వహించారు. 26వ తేదీ ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, దేవతా హోమాలు, మాలికారత్తమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపారు. 28న గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి పడిపూజోత్సవాలను ముగించనున్నట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి



హోమగుండం వద్ద అగ్ని ప్రతిష్ఠాపన పూజలు

వైభవంగా గరుడాళ్వార్ల ప్రతిష్ఠా మహోత్సవం

అవనిగడ్డ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గీతా మందిరంలో గరుడాళ్వార్ల దివ్య ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆగమ పడింతులు పరాశం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్త పోతన ప్రకాష్ - హేమ దంపతులు విశిష్ట అతిథులుగా పాల్గొని పూజలు జరిపారు. మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచనం జరిగాయి. ఎంపీపీ తుంగల సుమతిదేవి, మత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ జరిగింది. కమిటీ అధ్యక్షులు తుంగల అంకారావు, హరిబాబులు పర్యవేక్షించారు.



బందరు తెలుగు చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర



మోదుమూడి సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో క్రైస్తవులు



పెదప్రోలు చర్చిలో కేక్ కట్ చేస్తున్న దైవసేవకులు

క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవుల ప్రార్థనలు

● భక్తిశ్రద్ధలతో క్రిస్మస్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మానవాళిని రక్షించేందుకు కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మించారని, ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, త్యాగం, క్షమ గుణాలు అందరూ ఆచరించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నగరంలోని తెలుగుచర్చి, ఆర్‌సీఎం, ఫైనీ, నోబుల్, ఇంగ్లీష చర్చిలతో పాటు చిన్నాపురంలోని చర్చిలలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. మత పెద్దల నుంచి ఆశీర్వచనాలు పొందారు. కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ దేవరపల్లి అనిత, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగ ఛాయాదేవి, టీడీపీ నాయకులు ముప్పల యోహాన్, లోగిశెట్టి వెంకటస్వామి, గుమ్మడి విద్యాసాగర్, చిన్నం శివ తదితరులు పాల్గొన్నారు. పేదల వస్త్రదాన కార్యక్రమంలో పాల్గొన్నారు .మూడో డివిజన్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో టీడీపీ సీనియర్ నేత గోపీచంద్ పాల్గొని కేకు కట్ చేశారు. మూడో డివిజన్ ఇన్‌చార్జి చిన్నం సురేష్, పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు. **పెడన** : ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఫాదర్లు జోజప్ప, జోజిరెడ్డి క్రిస్మస్ సందేశమిచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. **పెడన రూరల్** : లంకలకలవగుంట, ఉప్పలకలవగుంట, చెన్నూరు, జింజేరు, కొంకేపూడి, నడుపూరు, బోడగుంట, నందిగామ, పెనుమల్లి, కుమ్మరిగుంట, చేవేంద్ర, మడక, బల్లిపర్రు, శేరీవర్తర్లపల్లి, తదితర గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. లంకలకలవగుంట చర్చిలో పాస్టర్ జోజి రెడ్డి భక్తులకు ఆశీస్సులు అందించారు. **అవనిగడ్డ రూరల్** : మోదుమూడి ఆర్‌సీఎం చర్చిలో బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ రెవ.సురేష్ మెర్లో మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యాలతో జీవించాలని కోరా రు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. **నాగాయలంక** : క్రిస్మస్ పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బాలయేసు పుట్టకకు సంకేతంగా కీర్తనలు పాడుతూ ర్యాలీలు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మోపిదేవి : క్రిస్మస్ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచారు. వెంకటాపురం, బోడగుంట, పెదప్రోలు, మోపిదేవిలోని ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ సోదరులకు అన్నదానం ఏర్పాటు చేసి నూతన వస్త్రాలు అందించారు.

ఘంటసాల : మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవసేవకులు క్రీస్తు జన్మించటం కారణంగా లోకానికి రక్షణ వచ్చిందని తెలియజేశారు. ఘంటసాలపాలెం ఆర్‌సీఎం చర్చిలో ఫాస్టర్ భక్తినాథం కేక్ కట్ చేసి విశ్వాసులకు తినిపించారు.



ఘంటసాలపాలెం, సాలిపేట ఆర్సీఎం చర్చిలో..



పెడన ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుక



వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్

ఐవీఎం ఆధ్వర్యంలో వస్త్రాల పంపిణీ

చల్లపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రవికుమార్ క్రీస్తు సందేశాన్ని వివరించారు. దివిసీమలోని 12 గ్రామాల విశ్వాసులు, ఉపదేశికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పురిటిగడ్డలోని గోల్డెన్ క్యాండిల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ కేక్ కట్ చేశారు. 90 మంది నిరుపేదలకు సురేష్ - రోజా దంపతులు వస్త్రాలు పంపిణీ చేశారు. వేములపల్లి విజయ, సోఫి, పాస్టర్ బసవరావు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

● కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కాపులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం కోరారు. కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల వెంకట్రావు జయంతి కార్యక్రమాన్ని చిత్రకళా సంసద్‌లో బుధవారం కాపునాడు మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లమూడి వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. మిరియాల వెంకట్రావు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధిక సంఖ్యలో ఉన్న కాపులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వడ్లమూడి వీరాంజనేయులు కోరారు. కాపులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. చిన్నాపురం డాక్టర్‌గా ప్రసిద్ధి పొందిన డాక్టర్ ఆర్వీ లక్ష్మణస్వామి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గాదెపూడి సిద్ధాంతి అప్పినీడి పూర్ణచంద్రరావు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవిని సత్కరించారు. ప్రముఖ హరికథకుడు మడమల రాంబాబు, పెద్దిశెట్టి నాగభూషణరావు, మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు, బీజేపీ నాయకుడు పంతం గజేంద్రరావు, టీడీపీ నాయకుడు వాలిశెట్టి తిరుమలరావు, శాయన శివయ్య పాల్గొన్నారు.



మిరియాల వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపునాడు నేతలు

అవనిగడ్డలో జాబ్‌మేళా రేపు

అవనిగడ్డ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ సీడాప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి సంయుక్త ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్ మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 35 సంవత్సరాల లోపు వారు ఈ జాబ్ మేళాలో పాల్గొన వచ్చునన్నారు. పని అనుభవాన్ని బట్టి రూ.12 వేల నుంచి రూ.29 వేల మధ్య వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు జాబ్ మేళాకు బయోడేటాతో హాజరుకావాలని సూచించారు.

లివర్ వ్యాధిగ్రస్తుడికి సీఎం సాయం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద లకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పడుతుందని టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న చందనపు అభిలాషిత గురించి 14వ డివిజన్ టీడీపీ నాయకుడు అడపా రత్నాకర్ తీసుకు వెళ్లారు. సీఎం చంద్రబాబు స్పందించి రూ. 2,45, 516 మంజూరు చేశారు. చెక్కును బాధితురాలు చందనపు అభిలాషితకు గొర్రెపాటి గోపీచంద్ అందజేశారు. శ్రీరామదుర్గాప్రసాద్, చిట్టినాయుడు, చిన్నం శివ నాగేశ్వరరావు, షేక్ మదర్‌సా, పి.వి. ఫణికుమార్‌లు పాల్గొన్నారు.

రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా సురేష్‌కుమార్

పెడన, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెడన రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా ఎన్.వి.ఎన్. సురేష్‌కుమార్ నియమితులయ్యారు. సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌ను పదోన్నతిపై ఎస్టేట్ అధికారిగా నియమించారు. ఆయన గురువారం పదవీ బాధ్యతలు చేపడతారు.

వాలీబాల్ టోర్నమెంట్ 28 నుంచి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తనయుడు, ఫౌండేషన్ డైరెక్టర్ కొల్లు పునీత్ తెలిపారు. పద్మావతి కళాశాల ప్రాంగణంలో నిర్వహించే టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిగా రూ. 30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ. 10 వేలు, నాలుగవ బహుమతిగా రూ. 5వేలు ఇస్తామన్నారు. ఎటువంటి ఫీజు లేకుండా నిర్వహించే టోర్నమెంట్‌లో క్రీడాకారులు 9030855999కు ఫోన్ చేసి తమ టీమ్‌లను రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు.



మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ఘనంగా వాజ్‌పేయి శతజయంతి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వందో జయంతిని బుట్టాయిపేట బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

పంతం గజేంద్ర, కూనపరెడ్డి శ్రీనివాస్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, విశ్రాంత ఏఎస్పీ శాయన సుశీల్‌రావు, సూరిశెట్టి హరికృష్ణ, మత్తి వెంకటేశ్వరరావు, విన్నకోట సుబ్బారావు, బొర్రా రాధా తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్ : వాజ్‌పేయి శతజయంతి వేడుకలను మండల పరిధిలోని ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్ర పటానికి మండల బీజేపీ అధ్యక్షురాలు విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన ం చేశారు. నిర్వహించారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు నగరాయులు, పార్టీ నాయకులు భోగాది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ : కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువజన కేంద్రం విజయవాడ సిరి సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గుడ్ గవర్నెన్స్ డే సందర్భంగా మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి శతజయంతిని అవనిగడ్డ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, వంగర శేషగిరిరావు మాట్లాడుతూ దేశంలో గొప్ప నాయకులను స్మరించుకోవటం మన అదృష్టమన్నారు. అలాంటి గొప్ప నేతల్లో అటల్ బీహార్ వాజ్‌పేయి ముందు వరుసలో ఉంటారన్నారు. కె.గోవర్ధన, సిరి సోషల్ సర్వీస్ సొసైటీ వి.బాలకోటేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



గీతామందిరంలో విశేష పూజలు

చల్లపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా ఆదివారం గీతామందిరంలో విశేష పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వరదా హరిగోపాల్ - నాగమణి దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గీతామందిరంలో స్వామి వారికి ఊంజల సేవ, విష్ణుసహస్ర నామ పారాయణ, తిరప్పావై పాశుర ప్రవచనం, దివ్య ప్రబంధల అనుసంధానం జరిగాయి. ఆర్యవైశ్య కోశాధికారి తమ్మన సతీష్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600

రేపు జాబ్‌మేళా

అవనిగడ్డ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ సీడాప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్, కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామని, పలు కంపెనీలు పాల్గొంటాయని వారు పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన 35 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చని, పని అనుభవం మేరకు రూ.12 వేల నుంచి రూ.29 వేల మధ్య వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటాతో హాజరుకావాలని వారు సూచించారు.





గుడివాడ ఆర్సీఎం చర్చిలో క్రీస్తు సందేశాన్ని అందిస్తున్న ఫాదర్లు, ఫాదర్ మైఖేల్‌కు కానుకలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



పెదపారుపూడి రక్షణ సైన్యం దేవాలయంలో కేక్ కట్ చేస్తున్న మేజర్ విజయ్‌కుమార్



తోట్లవల్లూరు దైవస్వరూపి చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు సలోమాన్, షాలేం

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు ● బాలయేసును స్మరిస్తూ గీతాలు

ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చిలు క్రైస్తవులతో కిటకిటలాడాయి. ఓ బాలయేసు దేవా..మా పూజలందుకోవా అంటూ క్రీస్తు జననాన్ని స్ఫురించేలా ప్రత్యేక గీతాలు ఆలపించారు. పాస్టర్లు క్రీస్తు జననం విశిష్టతను వివరిస్తూ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొన్ని చర్చిల్లో ప్రార్థనల అనంతరం ఆత్మీయవిందులు జరిగాయి.

గుడివాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గుడివాడలోని మౌంట్ కార్మెల్ ఆర్సీఎం చర్చి, గుడ్‌మెన్‌పేట చర్చి, సీఎస్‌ఐ చర్చి, ఫుల్‌గాస్పెల్ చర్చి, గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్, రివైవల్ పెంతుకొస్తు మినిస్ట్రీస్, షారోను ప్రార్థనా మందిరం, ఫిలదెల్ఫియా ప్రార్థనా మందిరం, సీయోను గాస్పెల్ ఫెలోషిప్ చర్చి, న్యూలైఫ్ ప్రార్థనా మందిరం, సెయింట్ దేవదాసు చర్చి, బైబిల్ మిషన్ సీయోను ప్రార్థనా మందిరం, క్రీస్తు ప్రేమ సువార్త మందిరం, బెతెస్థ ప్రార్థనా మందిరం, నూతన యెరూషలేము ప్రార్థనామందిరం, ఇమ్మానియేలు చర్చి, బిలీవర్స్ ఫెలోషిప్, సీఎస్‌ఐ చర్చిల్లో పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని అందించారు. వేలాది మంది క్రైస్తవులు క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏలూరు రోడ్డులోని ఆర్సీఎం చర్చిలో మంగళవారం రాత్రి ప్రార్థనల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయపేటలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. శ్రీకాంత్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ సందర్భంగా తట్టివర్రు రోడ్డులోని పంపుల చెరువు సమీపంలో నివాసముంటున్న పేదలకు సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ(ఆర్కే) భోజనాలు, నూతన వస్త్రాలు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

చర్చిలు కిటకిట

గుడివాడ రూరల్: మోటూరు, లింగవరం, దొండపాడు, బిళ్లపాడులోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన క్రైస్తవులతో చర్చిలు కిటకిటలాడాయి.

కొవ్వొత్తులు వెలిగించి..

కూచిపూడి: మండలంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు వైభవంగా జరుపుకొన్నారు. క్రిస్మస్ గీతాలు, బోధనలతో చర్చిలు సందడిగా మారాయి. బాలయేసుకు ప్రత్యేక పూజలు చేసి కొవ్వొత్తులతో స్వాగతం పలికారు. మొవ్వలోని యేసే జవాబు ప్రాంగణంలో వేమూరి పరిశుద్ధరాజు ఆధ్వర్యంలో, కూచిపూడి ఆర్సీఎం చర్చిలో ఫాదర్ జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నముత్తేవి, పెదపూడి, మొవ్వ, కూచిపూడి, నిడుమోలు, భట్లపెనుమర్రు, కాజ, కోసూరు గ్రామాల్లోనూ వేడుకలు నిర్వహించారు. దైవ సేవకులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు. మత పెద్దలు సందేశాలు వినిపించారు.

ప్రత్యేక ప్రార్థనలు

పమిడిముక్కల: మేడూరు సీబీసీఎన్‌సీ చర్చిలో రెవరెండ్ రాజారత్నం ప్రార్థనలు చేశారు. మంటాడ, లంకపల్లి, కృష్ణాపురం పెంతుకోస్తు చర్చిల్లో పాస్టర్ వినోద్‌రావు క్రిస్మస్ సందేశాన్ని భక్తులకు వినిపించారు.

క్రైస్తవులకు శుభాకాంక్షలు

పామర్రు: నియోజకవర్గంలోని క్రైస్తవులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ మిషన్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో వృద్ధులకు, పేదలకు సర్పంచ్ కె.కస్తూరి కొత్త వస్త్రాలను బహూకరించారు.

కేక్ కటింగ్‌లు..

పెదపారుపూడి: యలమర్రు, చినపారుపూడి, వెంట్రప్రగడ, దోసపాడు, పెదపారుపూడిలో క్రీస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. పెదపారుపూడి రక్షణ సైన్యం దేవాలయంలో మేజర్ వి.విజయ్ కుమార్ కేక్ కట్ చేశారు.

క్రీస్తు జననంతో లోకానికి వెలుగు

తోట్లవల్లూరు: ఏసుక్రీస్తు జననంతో లోకానికి వెలుగు వచ్చిందని, పాపులకు విముక్తి కలిగిందని పాస్టర్ వల్లూరు సలోమాన్ అన్నారు. దైవస్వరూపి చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేకును పాస్టర్ వల్లూరు షాలేమ్‌తో కలిసి ఆయన కట్ చేశారు. క్రైస్తవులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. తోట్లవల్లూరులో సీబీఎం చర్చి, ఆర్సీఎం చర్చి, మరనాత విశ్వాస సమాజం చర్చి, మోరియా చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిల్లో ప్రార్థనల అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



కూచిపూడి ఆర్సీఎం చర్చిలో సందేశమిస్తున్న ఫాదర్ జాకబ్‌ప్రసాద్



పామర్రు బైబిల్ మిషన్ చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కె.కస్తూరి

కూచిపూడి నాట్య అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

కూచిపూడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కూచిపూడి నాట్యాభివృద్ధికి ప్రభుత్వపరంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మ ఆట్లాడారు. ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించే కూచిపూడి పతాక స్వర్ణోత్సవ వేడుకలు విజయవంతానికి అందరూ కృషి చేయాలన్నారు. కూచిపూడి అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టిసారించినట్లు తెలిపారు. నాట్యోత్సవ వేడుకల్లో భాగంగా తొలి రోజు 27న సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రెండో రోజున ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముగింపు రోజున డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొంటారని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకల ద్వారా కూచిపూడి సంస్కృతీ, సంప్రదాయాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహించటం ఎంతైనా అభినందనీయమన్నారు. దేశవిదేశాలకు చెందిన కళాకారులు వేడుకల్లో పాల్గొని ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. ముగింపు రోజున 2 వేల మంది కళాకారులతో బృంద నాట్య ప్రదర్శన నిర్వహించటం అందరికీ గర్వకారణమన్నారు. పామర్రు నియోజకవర్గంలో కూచిపూడి ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హామీలిచ్చి మరిచిపోవడం చంద్రబాబుకు అలవాటే

● వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు

గుడివాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): హామీలిచ్చి మరచిపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అలవాటేనని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు విమర్శించారు. బుధవారం భయ్యావారి వీధిలోని తన కార్యాలయంలో విద్యుత్ చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై రూ.15,485కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందన్నారు. వైసీపీ ఈనెల 27వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేస్తుందని, వైసీపీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయలని ఆయన పిలుపునిచ్చారు. షేక్ బాజీ, కొంకతల ఆంజనేయప్రసాద్, దుడ్డు చిన్న, షేక్ సయ్యద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వస్త్రవ్యాపారి దుర్మరణం

గుడివాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శివాలయానికి నడిచి వెళ్లి వస్తున్న వస్త్రవ్యాపారిని నర్సాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో బుధవారం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన వస్త్రవ్యాపారి దొడ్డి జగన్మోహనరావు(54) ఉదయం శివాలయానికి వెళ్లి వస్తుండగా మార్కెట్ సెంటర్‌లో విజయవాడ నుంచి నర్సాపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి కుమారుడు గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్‌కుమార్ తెలిపారు.

భార్యాభర్తల మధ్య గొడవ

● ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహిత..కేసు నమోదు

పెదపారుపూడి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా మనస్థాపం చెందిన వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిందని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. 'గురువిందగుంట గ్రామానికి చెందిన నాగదుర్గారావు సతీమణి భానుశ్రీ వ్యవసాయ కూలి పనులు చేస్తూ ఇంటి వద్దనే ఉంటోంది. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిస్తే 9440113645కు ఫోన్ చేసి తెలపాలి.' అని ఎస్సై సూచించారు.

నీటిలో వరి పనలు..ఆందోళనలో రైతులు



గోపువానిపాలెంలో వర్షపునీటిలోనే వరి పనలు

పమిడిముక్కల, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండురోజుల నుంచి కురుస్తున్న తేలికపాటి వర్షాలకు పల్లపు పొలాల్లో నీళ్లు నిలిచి, వరిపనలు నీటిలో నానుతున్నాయి. మండలంలో వరి కోతలు కోసి కొంతమేర కట్టి కుప్పలు వేశారు. ఇంకా కట్టని పల్లపు పొలాల్లో నీరు పోయే మార్గంలేక నీటిలో పనలు నానుతున్నాయి. మరో రెండురోజులపాటు వానలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిస్తోందని, ఒకవేళ కుప్పవేసినా పనలు ఆరని కారణంగా ధాన్యం రంగు మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. హడావుడిగా వేసిన కుప్పల్లోనూ వర్షాలకు నీరు దిగుతుందేమోనని అంటున్నారు. యంత్రాలతో కోయించిన రైతులు ధాన్యం అయినకాడికి అమ్ముకోవడం వల్ల కొంతమేర బయటపడ్డామని చెబుతున్నారు.



తాడంకిలో..

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

గుడివాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం పట్టణానికి చెందిన కొల్లిపర గోపాలకృష్ణమూర్తి, విజయలక్ష్మి దంపతులు రూ. 35వేలు విరాళాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ శాయన రాజేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు(వాసు), దాతల కుమారులు యశ్వంత్‌కుమార్, సుమంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శపాలకుడు వాజ్‌పేయి

ఘనంగా 100వ జయంతి వేడుకలు ●నివాళులర్పించిన బీజేపీ నేతలు





గుడివాడ బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ తదితరులు

గుడివాడ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆదర్శపాలకుడని, ప్రపంచ దేశాల ముందు దేశం గర్వించదగ్గ పాలన అందించారని బీజేపీ రాష్ట్ర నాయకుడు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. అంగడాల సతీష్, యర్రపోతు అర్జున్, రాంప్రసాద్, సూరే గాంధీ, శలంకాయల లీలాకుమారి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు

వాజ్‌పేయి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. ధనియాలపేటలోని ప్రణవాశ్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వాజపేయి జయంతి వేడుకలు నిర్వహించి, మొక్కలు నాటారు. ఛాత్రాలయ విద్యార్థులకు భోజనాలు పెట్టారు. దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.



ఊయలసేవలో పైడమ్మ

వైభవంగా పైడమ్మ ఊయలసేవ

పెడన, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతర ఉత్సవాలు ముగియడంతో బుధవారం పైడమ్మ అమ్మవారికి ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారు గర్భగుడి ప్రవేశం చేశారు. చిన్నారులను అమ్మవారి ఆశీస్సుల కోసం ఊయలలో కూర్చోబెట్టి ఊపారు. ఈవో టి.వి.వి. మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జనవరి 5వ తేదీన ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన జరుగుతుందని ఈవో తెలిపారు.

విద్యుదాఘాతంతో స్వీపర్ దుర్మరణం

కోడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పిట్టల్లంక గ్రామంలో విద్యుదాఘాతంతో బుధవారం పంచాయతీ స్వీపర్ తెనాలి రంగారావు (54) మృతి చెందాడు. వాటర్ ట్యాంక్ నిండటంతో మోటార్ స్విచ్ ఆఫ్ చేసేందుకు రంగారావు వెళ్లాడు. స్విచ్ ఆఫ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాణక్య తెలిపారు.

కాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి

● కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కాపులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం కోరారు. చిత్రకళాసంసద్‌లో బుధవారం కాపునాడు వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల వెంకట్రావు జయంతి కార్యక్రమాన్ని కాపునాడు మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లమూడి వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. మిరియాల వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పించారు. అధిక సంఖ్యలో ఉన్న కాపులకు అన్ని రాజకీయ పార్టీలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని వడ్లమూడి వీరాంజనేయులు కోరారు. కాపులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. చిన్నాపురం డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ ఆర్వీ లక్ష్మణస్వామి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గాదెపూడి సిద్ధాంతి అప్పినీడి పూర్ణచంద్రరావు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవిని సత్కరించారు. మడమల రాంబాబు, పెద్దిశెట్టి నాగభూషణరావు, కొట్టె వెంకట్రావు, బీజేపీ నేత పంతం గజేంద్రరావు, వాలిశెట్టి తిరుమలరావు పాల్గొన్నారు.



మిరియాల వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపునాడు నాయకులు